సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 30 । జూన్ । 2023



పారదర్శకంగా కేజీబీవీల్లో నియామకం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేజీబీవీల్లో సిబ్బంది నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూ ప్రక్రియ కడపలో ప్రారంభమైంది. -8లో



హంస వాహనంపై సిద్దేశ్వరుడు

తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో శ్రీ సిద్దేశ్వరస్వామి హంస వాహనం, చెన్నకేశవస్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. -8లో

మదనపల్లె :
పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	451
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 532.06 కిలోలు



న్యూస్‌రీల్

గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ/ పీలేరు రూరల్: పీలేరు రూరల్ : అరుణాచలం (తిరువణ్ణామలై) గిరిప్రదక్షిణకు భక్తుల సౌకర్యార్థం పీలేరు డిపో నుంచి ఏడు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. జూలై 2న మధ్యాహ్నం 12 గంటలకు పీలేరు నుంచి 3, కేవీపల్లె నుంచి 2, సదుం నుంచి 2 బస్సులు బయలుదేరి వెళతాయన్నారు. ఆసక్తి గలవారు కె.వి.రమణ (7893152748), ప్రమీల (738 2878751)ను సంప్రదించాలన్నారు. మదన పల్లె డిపో నుంచి జులై 2న తిరువణ్ణామలైకి రెండు అల్ట్రా డీలక్స్‌లతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. అల్ట్రా డీలక్స్‌లో రానుపోను చార్జి రూ.805, ఎక్స్‌ప్రెస్‌లో రూ.670 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 7382875034, 738287 6638,9441646104, 9440249483ను సంప్రదించాలని కోరారు.

రాయితీ ధరతో రైతు బజార్లలో టమాట విక్రయాలు

రాయచోటి: అధిక ధరలు పలుకుతున్న టమాటాలను ప్రజల సౌకర్యార్థం కిలో రూ.50 చొప్పున జిల్లాలోని రైతు బజార్లలో విక్రయించడానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి టి.త్యాగరాజు తెలిపారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పత్రికలకు ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి రాయచోటిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాయితీ ధర్పై కడప రైతు బజారు, కర్నూలు సి.క్యాంపు రైతు బజారుకు 10 టన్నులు టమాటాలను సరఫరా చేస్తామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి పేర్కొన్నారు.

'సీనియర్ సిటిజెన్స్' ఉపాధ్యక్షుడి ఎన్నిక



మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: ఏపి సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్.మునిగోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మదనపల్లె అధ్యక్షుడిగా పని చేస్తున్న ఆయనను ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చారు. మునిగోపాలకృష్ణను రాష్ట్ర స్థాయి నాయకులు రంగారావు, వెంకటరమణారెడ్డి, మునిరత్నం, జగన్‌మోహన్‌లు అభినందించారు.

మదనపల్లె ఈద్గాలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు (ఇన్‌సెట్) రాయచోటి ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న జేసీ, డీఎస్పీలు





భక్తిశ్రద్ధలతో బక్రీద్

రాయచోటి : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మత పెద్దలు ఖురాన్ చదివి వినిపించారు. పెద్దల సమాధుల వద్ద పూలమాలు వేసి నివాళులర్పించారు. అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ త్యాగాలకు మారుపేరుగా తాము బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటున్నామని ముస్లిం సోదరులు తెలిపారు.

కిటకిటలాడిన ఈద్గా మైదానాలు

ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలతో పల్లె, పట్టణాల్లోని ఈద్గాలు, మసీదులు కిటకిటలాడాయి. రాయచోటి, మదనపల్లె, రాజంపేట, పీలేరు, కలికిరి ప్రాంతాల్లోని ఈద్గాల్లో అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, కురబలకోట, వాల్మీకిపురం, గుర్రంకొండ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాదిరే బక్రీద్‌ను కూడా ఖుద్బా అనే ధార్మిక ప్రసంగంతో గురువులు ప్రారంభించారు. సామూహిక ప్రార్థనల తర్వాత ఖుర్బానీ నిర్వహించారు. ఖుర్బానీ ఇవ్వడానికి హజరత్ ఇబ్రహీం అనేక ప్రవక్త త్యాగమే కారణమని పెద్దలు వినిపించారు.



ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, ముస్లిం సోదరులు

ప్రార్థనలలో ఎమ్మెల్యే, జేసీ, డీఎస్పీలు

రాయచోటిలో అన్నమయ్య జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎస్పీ మహబూబ్‌బాషా, మదనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం స్థానిక మత పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు.

ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేట ప్రాంతాల్లో అదనపు బలగాలతో ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

అండర్-19 క్రికెట్ టోర్నీ ప్రారంభం



తలపడుతున్న కడప, కర్నూలు జట్లు


కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా గురువారం ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలిమ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 93 పరుగులు చేశాడు. కడప బౌలర్లు అస్లాం 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 44.5 ఓవర్లలోనే 6 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ప్రణీల్‌రెడ్డి 98 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్సర్‌తో 107 పరుగులుచేశాడు. దీంతో కడప జట్టు విజయం సాధించింది.

అనంత' జట్టు విజయం:

నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. జట్టులోని వీరారెడ్డి 68 పరుగులు, వెంకటలోకేష్ 68 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ వెంకయ్య 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు బ్యాట్స్‌మన్ 38.5 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌట్ అయ్యారు. జట్టులోని మన్విత్ 95 బంతుల్లో 8ఫోర్లు, 6 సిక్సర్‌లతో 101 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రదీప్ 4, తన్వీర్ 3 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 116 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

మైలవరం జలాశయానికి నీరు విడుదల

కొండాపురం(వైఎస్సార్ జిల్లా): గండికోట జలాశయం నుంచి రెండు గేట్లుఎత్తి మైలవరం జలాశయానికి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారి ఉమామహేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైలవరం జలాశయం కింద తాగు, సాగునీటి అవసరాలకోసం నీళ్లు వదిలినట్లు చెప్పారు. గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టిఎంసీలు. ప్రస్తుతం 24.16 టీఎంసీల నీటి మట్టం ఉందన్నారు గండికోట డ్యాం వాటర్ లెవల్ (ఎఫ్ ఆర్ఎల్) 211.4 మీటర్లు ఉన్నాయన్నారు. గండికోట మెయిన్ రెగ్యులేటర్ ద్వారా సర్వారాయసాగర్ కు 400 క్యూసెక్కులు నీరు కొనసాగుతున్నట్లు జలవనరులశాఖ అధికారి ఉమామహేశ్వర్లు తెలిపారు.



గండికోట జలాశయం నుంచి నీరు వదులుతున్న దృశ్యం

హంసవాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు(రాజంపేట): నందలూరు సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారు హంసవాహనంపై ఊరేగారు. ముందుగా వాహనసేవ మండపంలో ఉత్సవమూర్తిని అందంగా అలంకరించి హంసవాహనంపై ఆసీనులు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ అర్చక స్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా పూజలు జరిగాయి.స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా వచ్చేనెల 4న జరిగే కళ్యాణానికి ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పట్టువస్త్రాలను టీటీడీ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, టీటీడీ సూపరింటెండెంట్ వెంకటేశ్వరయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టరు దిలీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెలనాని, సోమిశెట్టి ప్రభాకర్, అర్ముగం విశ్వనాథ్,నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



హంసవాహనంపై కొలువుదీరిన స్వామివారు

శభాష్..దర్వేష్



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో దర్వేష్, కూర్చున్న వారిలో మూడో వ్యక్తి. (ఇన్‌సెట్) దర్వేష్ సాహెబ్ ఫైల్ ఫొటో

పోరుమామిళ్ల: వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన షేక్ దర్వేష్ సాహెబ్ కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.క్రీడ్ రోజున దర్వేష్ సాహెబ్‌కు ఉన్నత పదవి దక్కడంతో ఇక్కడ ఆయన బాల్య స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మా పిల్లలకు స్ఫూర్తి



పోరుమామిళ్లలో మాతో బాల్యంలో ఆటలాడిన స్నేహితుడు ఓ రాష్ట్రానికి అత్యున్నత పదవి అలంకరించడం నిజంగా మాకు గర్వకారణం. ఆయన మా పిల్లలకు స్ఫూర్తి. ఎప్పుడు సందర్భం వచ్చినా నేను మా పిల్లలకు దర్వేష్ గురించి చెపుతాను. అలా ఎదగాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నడవాలని చెపుతుంటాను. -గురుస్వామి, పాత్రికేయుడు, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నిజాయితీకి మారుపేరు



దర్వేష్ ఈ స్థాయికి చేరడం మాటల్లో చెప్పేది కాదు. పట్టుదల, నిజాయితీ, అనుకున్నది సాధించాలనే ధ్యేయం, నిర్మోహమాటం దర్వేష్ గుణాలు. అందుకే కేరళ ముఖ్యమంత్రి అయనను అభిమానించారు. స్నేహితులను ప్రేమించడం ఆయన తత్వం. కూతురు డాక్టర్ ఆయేషా అలియా, అల్లుడు మహమ్మద్, సైంటిస్ట్ జర్మనీలో ఉన్నారు. -గొంగల్‌రెడ్డి శేషారెడ్డి, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఛైర్మెన్, కడప

మాకు గర్వకారణం



పోరుమామిళ్లలో నాలుగు దశాబ్దాల క్రితం మాతో కలసి చదివిన దర్వేష్ ఓ రాష్ట్రంలో అత్యున్నత పదవి అలంకరించడం నిజంగా మాకు గర్వకారణం. అప్పట్లోనే దర్వేష్ ఎంతో చురుగ్గా ఉండేవాడు. ఎంతో నిజాయితీగా ఉంటాడు. పోరుమామిళ్లలో మా బ్యాచ్ అందరం ఏర్పాటు చేసుకున్న గెట్ టు గెదర్ ఫంక్షన్‌కు వచ్చి ఎంతో కలివిడిగా, ఆప్యాయంగా అందరితో కలసి పోయారు. మా ఇంటికి దగ్గరలోనే వారి ఇల్లు. హ్యాట్స్ ఆఫ్ దర్వేష్. -మహమ్మద్ ఖాసీం, వ్యాపారి

ట్రిపుల్ ఐటీ.. చదువుల దివిటీ

- 4400సీట్లకు గానూ 38,490 దరఖాస్తులు
- క్రమశిక్షణ, నాణ్యమైన ఉత్తమ విద్యా బోధన
- జులై 13న అర్హుల జాబితా విడుదల

వేంపల్లె : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలు చదువులో మేటిగా నిలుస్తున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమశిక్షణ, నాణ్యమైన ఉత్తమ విద్యా బోధనను అందిస్తున్నాయి. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యా బోధనకు నిలయమైన ట్రిపుల్ ఐటీల్లో చదువుతోపాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, నాట్యం, యోగా వంటి వాటిలో శిక్షణ కూడా ఇస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నాలుగు ట్రిపుల్ ఐటీలలో 4000సీట్లతోపాటు ఈడబ్ల్యూసీ కోటాలో మరో 400 కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. వీటిని రోస్టర్ ప్రకారం భర్తీ చేయడంతోపాటు ప్రత్యేక కేటగిరీ కింద స్పోర్ట్స్, స్కౌట్ అండ్‌గైడ్స్, సీఏపీ, ఎన్‌సీసీ దివ్యాంగుల కోటా కింద సీట్లు కేటాయిస్తారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్రార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉంటే 4శాతం డిప్రివేషన్ మార్కులు కలిపి మెరిట్ ఆధారంగా సీట్లను ఎంపిక చేస్తారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల సమీకృత ఇంటిగ్రేటెడ్ కోర్సును చదివేందుకు మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.40వేలు, తర్వాత నాలుగేళ్లు ఏడాదికి రూ.50వేల చొప్పున ఫీజు చెల్లించాలి. ఏపీ కాకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 5 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు అందుబాటులో ఉంటాయి. ఈ కోటాలో చేరిన వారు ఏడాదికి రూ.1.50లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. సోమవారంతో ట్రిపుల్ ఐటీల ప్రవేశాలకు దరఖాస్తులు ముగియడంతో ట్రిపుల్ ఐటీలలో 4400సీట్లకు గానూ 38,490 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పదవ తరగతి రీవాల్యుయేషన్ లో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి జూలై 5 లోపల మార్కుల మెమోను స్కాన్ చేసి యూనివర్సిటీ వెబ్సైట్ కు పంపించాలని ఆర్జీయూకేటీ చాన్సలర్ కె.చెంచు రెడ్డి తెలిపారు. అలాగే ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు జూన్ 30వ తేదీన యూనివర్సిటీ వెబ్ సైట్ నుంచి కాల్ లెటర్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. వీరికి ఏలూరు జిల్లా నూజివీడు క్యాంపస్‌లో జూలై 5 నుంచి 9వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతాయని చెప్పారు.



ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ముఖ్య ద్వారం



ట్రిపుల్ ఐటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

విద్యా బోధన ఇలా.. :

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌లో మొదటి రెండేళ్లు ఇంటర్‌కు సమానమైన పీయూసీ కోర్సు, తర్వాత నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు. ప్రతినెలా పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభమై నవంబర్ 30 వరకు కొనసాగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. సెలవు రోజుల్లో తల్లిదండ్రులు వచ్చి పిల్లలతో గడపడానికి అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో పిల్లలను ఇళ్లకు పంపుతారు. అయితే ఇచ్చిన గడువులోగా తిరిగి రాకపోతే ఫైన్ విధిస్తారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తారు. ట్రిపుల్ ఐటీ ఆవరణాల్లోనే 30పడకల ఆసుపత్రి ఉండగా.. 24గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు.

రోజు వారీ కార్యక్రమాలు :

ఉదయం అల్పాహారం, అనంతరం అసెంబుల్, 8 నుంచి 12గంటలవరకు తరగతులు, 12 నుంచి 1గంట వరకు భోజన విరామం, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5గంటలవరకు తరగతులు, అనంతరం టీ, స్నాక్స్, 6గంటల వరకు ఆటలు, రాత్రి 7గంటలకు భోజనం, అనంతరం రాత్రి 10గంటల వరకు స్టడీ అవర్స్, ఇది ట్రిపుల్ ఐటీలలో రోజువారీ

జులై 13న అర్హుల జాబితా..

వచ్చేనెల జులై 13న ట్రిపుల్ ఐటీలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అర్హుల జాబితాను విడుదల చేస్తారు. ఈనెల 30వ తేదీన దరఖాస్తు చేసుకున్న వారికి కాల్ లెటర్లు, మెసేజ్ రూపంలో తెలియజేస్తారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు జులై 5వ తేదీ నుంచి 9వ తేదీవరకు నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. జులై 21, 22వ తేదీలలో నూజివీడు, ఇడుపులపాయ, 24, 25వ తేదీలలో ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలలో కౌన్సిలింగ్ పక్రియ నిర్వహిస్తారు. ఏ క్యాంపస్‌లో సీటు వస్తే అక్కడే చదవాల్సి ఉంటుంది.

కౌన్సెలింగ్‌కు ఇవి తప్పనిసరి.. :

పదో తరగతి హాల్ టిక్కెట్, టెన్త్ మార్కుల జాబితా, టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్(4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, అభ్యర్థి, అతని తండ్రి లేదా తల్లివి రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, రేషన్ కార్డు, అభ్యర్థి ఆధార్ కార్డు, విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు రుణం అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఇడెంటిటీ కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు ఐడీతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలి.

ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు



ట్రిపుల్ ఐటీ సీట్లు ప్రతిభ ఆధారంగానే సీట్లు కేటాయిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతోనే ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సీటు లభిస్తే ఆరేళ్ల సమీకృత సాంకేతిక ఉచిత విద్యనభ్యసించి ఇంజినీరింగ్ డిగ్రీతో బయటకు వెళ్లవచ్చు. ఈ ఏడాది అన్ని జిల్లాలకు సమానంగా సీట్లు కేటాయిస్తాం.

– కె.చెంచురెడ్డి(ఆర్జీయూకేటీ చాన్సులర్), ఇడుపులపాయ

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో నిరోషా

తంబళ్లపల్లె : కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. మండలంలోని ఆర్‌ఎన్ తాండా పంచాయతీ బోనాసువారిపల్లెకు చెందిన రమణ భార్య నిరోషా(27), స్వగృహంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. గుర్తించిన కుటుంబీకులు హుటాహుటీన బాధితురాలిని తంబళ్లపల్లె వైద్యవిధానపరిషత్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వెంకటరామయ్య ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బాధితురాలి కుటుంబీకుల సూచనపై బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

మహిళా రైతుకు పాము కాటు

ములకలచెరువు : పొలం పనులు చేసుకుంటున్న ఒక మహిళా రైతుకు గురువారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. 108 సిబ్బంది కథనం మేరకు ... మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన నారాయణమ్మ(60) తన పొలంలో పనులు చేసుకుంటుండగా పాముకాటు వేసింది. దీనితో అస్వస్థతకు గురైన మహిళా రైతును కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనం ద్వారా ములకలచెరువు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఉపాధి కూలి మృతి



మృతిచెందిన ఉపాధి కూలీ పద్మావతి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయితీ తువ్వపల్లెలో గురువారం పద్మావతి అనే మహిళ ఉపాధి పనులకు వెళ్లి పనులు చేస్తుండగా సొమ్మసిల్లి కింద పడిపోయింది. చుట్టుపక్కల తోటి ఉపాధి కూలీలు పద్మావతి దగ్గరకు వెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ జనార్ధన్‌రెడ్డి.. ఉపాధి కూలీ పద్మావతి స్వగృహానికి చేరుకున్నారు. మృత దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

రెండు నెలలు వివాహాలకు విరామం

- ఆషాడం, అధిక శ్రావణం బ్రేకులు
- జూలైలో ముహూర్తాలు లేవు



కడప కల్చరల్ : మొన్నటివరకు మోగిన పెళ్లి బాజాలకు రెండు మాసాల విరామం లభించింది. మే నెలలో దాదాపు రోజుమార్చి రోజు హోరెత్తిన మంగళ వాయిద్యాలకు ప్రస్తుతం బ్రేకులు పడ్డాయి. ఏప్రిల్‌లో గురు మూఢమి కారణంగా ఒక్క శుభముహూర్తం కూడా లేదు. అలాగే జులై మాసంలో కూడా ఒక్కటంటే ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. నిజానికి జూన్ 11 తర్వాత శుభ ముహూర్తాలకు బ్రేకులు పడ్డాయి.

వివాహాలకు రెండు మాసాలపాటు విరామం వచ్చినట్లయింది. జూన్ 11 నాటికి శుభముహూర్తాలు ముగిసిపోగా తిరిగి ఆగస్టు 19 నుంచి మాత్రమే ముహూర్తాలు ఉన్నాయి. అంటే దాదాపు 70 రోజుల దాక పెళ్లి బాజాలు వినిపించవంటే విశేషమే. మే మాసం దాదాపు రోజు విడిచి రోజుగా జరిగిన పెళ్లిళ్లు జూన్‌లో కేవలం వారం రోజులకు మాత్రమే పరిమితమయ్యాయి. ఏప్రిల్‌లో గురు మూఢమి కారణంగా పూర్తిగా వివాహాలు లేవు. అలాగే జూన్ 19 నుంచి ఆషాడం కావడం, ఆ తర్వాత జులై 18 నుంచి ఆగస్టు 18 వరకు అధిక (మాసం) శ్రావణం రావడంతో కల్యాణాలకు దాదాపు 70 రోజులపాటు అంతరాయం కలగడం విశేషం. మొత్తంపై మే మాసంలో వినిపించిన పెళ్లి బాజాలు జూన్ 11 వరకు కొనసాగగా, ఆ తర్వాత మూగబోయాయి. జూన్ 11 తర్వాత రెండు నెలలకు పైగా ఒక్కటంటే ఒక్క శుభముహూర్తం లేకపోవడం గమనార్హం. ఆగస్టు 19 నుంచి మాత్రమే ముహూర్తాలు ఉన్నాయి.

గ్యాప్ కారణంగా ధరల దడ

దాదాపు రెండు నెలలపాటు వివాహాలకు విరామం లభించడం, ఇప్పటికే వివాహాలు కుదుర్చుకున్న పెద్దలకు ఖర్చుల విషయంగా చికాకులు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుత ధరల పెరుగుదల వేగంతో పోల్చుకుంటే ముహూర్తాలు లేని ఈ రెండున్నర నెలల్లో ధరలు మరింత పెరుగుతాయన్న ఆందోళన వారిలో ఉంది. ప్రధానంగా గత ఏడాది ఇదే సీజన్‌లో గ్రాము (నగల) బంగారం రూ. 4800 ఉండగా, ఈ సంవత్సరం జనవరిలో రూ. 4980కు చేరింది. ఆ తర్వాత వివాహాల సీజన్ జోరందుకోవడంతో ప్రస్తుతం గ్రాము ధర రూ. 5580కు చేరుకోవడంతో ఆరు నెలలకే రూ. 700కు పైగా పెరుగుదల ఉండడంతో మరో రెండు నెలల తర్వాత ఏమాత్రం పెరుగుతుందోనన్న ఆందోళన పెద్దల్లో ఉంది. కొందరు ముందే కొని పెట్టుకున్నా మరికొందరు శ్రావణ మాసంలో కొనడం మంచిదన్న ధోరణిలో ఉండిపోయారు. ఈలోపు బంగారం కొనలేకపోయిన వారు అప్పటికి పెరిగిన ధరను చెల్లించేందుకు మానసికంగా సిద్ధమయ్యారు.

వస్త్రాల భగభగ

వివాహాలకు అవసరమైన దుస్తుల ధర విషయంలో కూడా పెద్దల్లో ఆందోళన కనిపిస్తోంది. రెండు నెలలకు ముందే దుస్తులు కొని పెట్టుకునే అవకాశం లేదు గనుక ఆషాడం తర్వాత మార్కెట్‌కు నూతన స్టాక్ వస్తుంది గనుక ధరలు కూడా అదేస్థాయిలో పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. బంగారం తర్వాత నూతన వస్త్రాలకే ఎక్కువ ధనం వెచ్చించాల్సి వస్తోంది. అందుకే వస్త్రాల విషయంగా కూడా పెద్దల్లో ఆందోళన నెలకొన్నది.

భారం కానున్న విందు

బంగారం, వస్త్రాల తర్వాత వివాహ భోజనాలకే ఎక్కువ వెచ్చించాల్సి వస్తోంది. ప్రస్తుతం పెళ్లి భోజనం ప్లేటు ధర రూ. 250–400కు పైగా అవుతోంది. దీంతో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు మరో రెండున్నర నెలల తర్వాత ఏ స్థాయిలో చేరుతాయోనని పెళ్లి నిర్వహణకు సిద్ధమైన పెద్దల్లో గుబులు నెలకొని ఉంది. అయినా తప్పదు గనుక సెప్టెంబరు మాసంలో కూడా కేవలం మొదటి వారంలో మాత్రమే శుభ ముహూర్తాలు ఉన్నాయి గనుక ఎక్కువ శాతం మంది ఆ ముందే వివాహాలు కానిచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు మార్కెట్ల వర్గాల సమాచారం. ఆ తర్వాత డిసెంబరు వరకు ప్రతినెల ముహూర్తాలు పుష్కలంగా ఉండడంతో మరికొందరు ఆ ముహూర్తాలలో వివాహాలు చేసేందుకు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

వలంటీర్ కుటుంబంపై దాడి

కలికిరి : మండలంలోని గుండ్లూరు గ్రామం ఈతమానువడ్డిపల్లికి చెందిన వలంటీర్, అతని కుటుంబంపై దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... ఈతమానువడ్డిపల్లిలో పూజారి జ్యోతి, ఆదినారాయణ వర్గాల వారు భూ తగాదాలు పడుతున్నారు. వలంటీర్ బండి శ్రీకాంత్‌బాబు, అతని కుటుంబ సభ్యులు ఆదినారాయణ వర్గానికి వత్తాసుపలికారనే అక్కసుతో జ్యోతి, ఆమె భర్త, మామ, ఇతర కుటుంబ సభ్యులు కలిసి బుధవారం రాత్రి వలంటీర్ ఇంటిపై దాడి చేసి గాయపరచడంతో పాటు ఇంటిలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. గాయపడిన శ్రీకాంత్‌బాబు, తల్లి, తండ్రి పీలేరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వలంటీర్ కుటుంబంపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం ఇరువర్గాలకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

వీరబల్లె మండల అభివృద్ధికి కృషి



అత్త సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

వీరబల్లి (రాయచోటి టౌన్): వీరబల్లె మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర గనుల, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన వీరబల్లె మండలానికి తన కుమారుడు ఎంపీ మిధున్‌రెడ్డితో కలసి అత్తారింటికి వచ్చారు. తన అత్త గాలివీటి రామలక్ష్మమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం బావమర్దులు మాజీ ఎంపీపీ గాలివీటి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, మురళిమోహన్‌రెడ్డి, మేనల్లుడు గాలివీటి విజయసాగర్ రెడ్డి (మదన్ రెడ్డి) స్థానికుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి పరిష్కారం చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సింగిల్ విండో అధ్యక్షులు మాజీ సర్పంచ్ దేశాయ్ చెన్నకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్‌లు వీరే



రాయచోటి : అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. గురువారం వెలువడిన ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా పరిధిలోని 30 మండలాల ఇన్‌ఛార్జ్‌ల పేర్లను ప్రకటించింది. మండలాల వారీగా జేసీఎస్ ఇన్‌ఛార్జ్‌ల నియామకం ఇలావుంది.

రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్వేలి జేసీఎస్ ఇన్‌ఛార్జ్‌గా ఎం.చెంగల్ రాయుడు, రైల్వేకోడూరు పల్లం రమేష్ బాబు, ఓబులవారిపల్లె కే.అమరేశ్వర్ రెడ్డి, పెనగలూరు లేబాక వెంకటరెడ్డి, పుల్లంపేట హరినాథ్‌రెడ్డి నాగిరెడ్డి నియమితులయ్యారు.

రాజంపేట నియోజకవర్గ పరిధిలో..

రాజంపేట మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్‌గా వడ్డే రమణ, రూరల్ ఇన్‌ఛార్జ్‌గా గంగిరెడ్డి, వీ.గంగిరెడ్డి, నందలూరు బీ.కరిముల్లాఖాన్, వీరబల్లి ఎం.నరేష్, వీ.సుండుపల్లె పీ.రహిముల్లాఖాన్, సిద్దవటం రాజశేఖర్‌రెడ్డి, ఒంటిమిట్ట జీ.రఘురామిరెడ్డి నియమితులయ్యారు.

రాయచోటి నియోజకవర్గ పరిధిలో..

చిన్నమండెం చుక్కా ఆంజనేయులు, గాలివీడు వెంకటరెడ్డి, గాలివీడు ఖాదర్‌మోహిద్దీన్, లక్కిరెడ్డిపల్లె లక్ష్మీనారాయణ, రామాపురం శ్రీధర్‌రెడ్డి, రాయచోటి రూరల్ పల్లం రమేష్, రాయచోటి మున్సిపాలిటీ యూ.రమణ, సంబేపల్లె వెంకటరమణారెడ్డి.

పీలేరు నియోజకవర్గ పరిధిలో..

గుర్రంకొండ సీ.నాగేంద్ర, కలకడ జె.మోహన్‌రాజ, కలికిరి పసుపులేటి రెడ్డప్ప, కంభంవారిపల్లె బీ.సతీష్ కుమార్‌రెడ్డి, పీలేరు చక్రి, వాల్మీకిపురం వెంకటరమణ.

తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో..

బీ.కొత్తకోట హరి, (ఎస్‌పీ) వెంకటకృష్ణయ్య, కురబలకోట ఈశ్వర్‌రెడ్డి, మొలకలచెరువు రవీంద్ర, పెద్దమండ్యం రెడ్డప్పరెడ్డి, పెద్దతిప్పసముద్రం రమణ, తంబళ్లపల్లె సురేష్‌రెడ్డి.

మదనపల్లె నియోజకవర్గ పరిధిలో..

మదనపల్లె కే.నాగరాజ, మదనపల్లె సీ1 ఏ.మునిశేఖర్, మదనపల్లె సీ2 షేక్ బాబాజీ, నిమ్మనపల్లె బీ.రామమోహన్‌రెడ్డి, రామసముద్రం జీ.నందకిషోర్‌రెడ్డి.

నేటితో ముగియనున్న పసుపు కొనుగోలు



మాట్లాడుతున్న పంజం సుకుమార్ రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైతు భరోసా కేంద్రాలలో చేపట్టిన పసుపు కొనుగోలు ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. రైతులు పండించిన పసుపునకు ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.6850గా నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 13 నుంచి జిల్లా వ్యాప్తంగా ఆయా రైతు భరోసా కేంద్రాలలో రైతుల నుంచి పసుపు కొనుగోలు ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 57 మంది రైతుల నుండి 58.87 మెట్రిక్ టన్నుల పసుపు కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలు అందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తూ ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని తెలిపారు. పసుపు రైతులకు గతంలో పసుపు క్వింటాకు మద్దతు ధర 5200 రూపాయలు ఉంటే.. ప్రస్తుతం రూ.6850 చేశారని తెలిపారు.

యువకుడిపై దాడి



దాడిలో గాయపడ్డ అఫ్రోజ్ అలీఖాన్

నిమ్మనపల్లె : యువకుడిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. కందూరురోడ్డులో నివాసం ఉన్న రహమత్‌ఖాన్ కుమారుడు అఫ్రోజ్ అలీఖాన్(35) మదనపల్లెలో సెల్‌షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చాడు. ఇదే గ్రామానికి చెందిన సమీప బంధువైన ముఖాసిద్దిక్ అలీఖాన్(42)కు, అఫ్రోజ్ కుటుంబానికి మధ్య గత కొంతకాలంగా ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఇరువురూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత కక్షలు పెంచుకున్నారు.

గురువారం మధ్యాహ్నం బక్రీద్ ప్రార్థనల అనంతరం ఇంటికి వెళుతున్న క్రమంలో ఇద్దరూ ఒకరికొకరు ఎదురుపడి కవ్వింపు చర్యలకు దిగడంతో ఘర్షణ జరిగింది. ఘటనలో ముఖాసిద్దిక్ అలీఖాన్ మరో ముగ్గురితో కలిసి అఫ్రోజ్‌అలీఖాన్‌పై దాడిచేశాడు. దాడిలో అఫ్రోజ్ అలీఖాన్ తలకు తీవ్రగాయం కాగా, ముఖాసిద్దిక్ అలీఖాన్ గాయపడ్డాడు. దీంతో ఇరువురిని చికిత్స నిమిత్తం స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాకు రూ. 204.79 కోట్ల

వైఎస్సార్ పంటలబీమా మంజూరు



గోపవరంలోని ఆర్‌బీకేలో ప్రదర్శించిన జాబితాను పరిశీలిస్తున్న రైతులు

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్ ప్రభుత్వం రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. పంటలకు మద్దతు ధర కల్పిస్తోంది. వీటితోపాటు వాతావరణ పరిస్థితులు, దిగుబడి తక్కువగా వచ్చి నష్టపోయిన రైతులను సైతం ఆదుకుంటోంది. జిల్లాలో 2022 ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి వాతావరణ పరిస్థితులు, దిగుబడి తగ్గి నష్టపోయిన పంటలకు గ్రామ, మండల యూనిట్ ఆధారంగా వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్ కింద జిల్లాకు రూ. 204.79 కోట్లు బీమా మంజూరైంది. దిగుబడి తగ్గి నష్టపోయిన పంటలకు రూ. 139.17 కోట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా దెబ్బతిన్న పంటలకు 65.62 కోట్లు మంజూరైంది. ఇందులో దిగుబడి తగ్గి నష్టపోయిన పంటలకు సంబంధించి కందికి రూ.71 లక్షలు, పత్తికి రూ. 120.12 కోట్లు, ఉల్లికి రూ. 15.59 కోట్లు, వరికి రూ. 2.75 కోట్లు, ఇలా మొత్తంగా రూ. 139.17 కోట్లు మంజూరైంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దెబ్బతిన్న పంటలకు సంబంధించి చీనినిమ్మకు రూ. 64.47 కోట్లు, వేరుశనగకు రూ. 1.16 కోట్లు మంజూరైంది. నష్ట పరిహారం డబ్బులను జులై 8వ తేదీన రైతుల ఖాతాలకు జమకానుందని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) ప్రదర్శించినట్లు చెప్పారు. రైతులు జాబితా పరిశీలించి అభ్యంతరాలు ఉంటే జులై 4వ తేదీలోగా ఆర్‌బీకేలో తెలియజేయాలని ఆయన తెలిపారు.

కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలో ఈనెల 27న తిరుమల హాస్పిటల్ సమీపంలో ఆటో ఢీకొనడంతో శిరివెళ్ల లలిత (35) తీవ్రంగా గాయపడింది. బాధితురాలి భర్త శిరివెళ్ల యాగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

రైతు సంక్షేమం కోసం బీకేఎస్ కృషి

రాజుపాళెం : రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు అన్నారు. మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి జాతీయ నాయకులు శ్రీధర్ రెడ్డి, రాము, కుమార స్వామి పలు సూచనలు, సలహాలు చేశారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు సంఘాన్ని ఎలా బలోపేతం చేయాలి తదితర విషయాలను తెలియజేశారు. జిల్లాలో కుందూనది పరివాహక ప్రాంతంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని .. రాబోవు రోజుల్లో రైతులతో ఉద్యమిస్తామని కడప జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ ప్రచార ప్రముఖ్ మధుసూదన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సుధారాణి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి తీవ్రగాయాలు

ములకలచెరువు : గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు... మండలంలోని వేపూరికోటకు చెందిన ఆనంద్‌రెడ్డి(40) వాహనం పైన రోడ్డుపై ఉండగా వెనకల వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆనంద్‌రెడ్డికి తీవ్రగాయాలు కావడంతో 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

కేజీబీవీలలో పారదర్శకంగా నియామక ప్రక్రియ

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేజీబీవీలలో సిబ్బంది నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూ ప్రక్రియ మొదటి రోజు గురువారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 172 మందికిగాను 156 మంది హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, డీఈఓ రాఘవరెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నియామక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌టీలకు డెమో తరగతులను నిర్వహించారు. అనంతరం జేసీ గణేష్‌కుమార్ మాట్లాడుతూ కేజీబీవీలలో సిబ్బంది నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక శుక్రవారం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్జెక్టు నిపుణులతోపాటు జీసీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

హంస వాహనంపై సిద్దేశ్వరుడు



తాళ్లపాకలో శేషవాహనంపై దర్శనమిస్తున్న శ్రీ చెన్నకేశవస్వామి



హంసవాహనంపై దర్శనమిస్తున్న శ్రీ సిద్దేశ్వరస్వామి

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ సిద్దేశ్వరస్వామి హంస వాహనం, చెన్నకేశవ స్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం రాత్రి శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తొలిరోజున చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వాహనాలను ముస్తాబు చేశారు. వాటిపై స్వామివార్లను కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం గ్రామపురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గౌరీశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తదితర టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పెద్ద పీట

- వెంకన్న ఆశీస్సులతో ధర్మ పరిరక్షణే ధ్యేయంగా దేవాలయాల నిర్మాణం
- టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఒక్కో గుడికి రూ.10 లక్షలు



గోపవరం మండలంలోని పీపీ కుంట యానాది కాలనీలో పూర్తయిన ఆలయం

రాజుపాళెం : పురాతన ఆలయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అలాగే ఆలయాల పునఃనిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. అదే విధంగా కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో హిందూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించి ప్రజల్లో భక్తి భావం పెంపొందించే దిశగా టీటీడీ ముందుకు సాగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ఆలయాల నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధుల కేటాయింపు జరుగుతుంది. ఒక్కో ఆలయానికి శ్రీవాణి ట్రస్ట్ రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందిస్తోంది. టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్, సమరసత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొత్త ఆలయాలు నిర్మించి నిత్యం దూప దీప నైవేద్యాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక శ్రీవాణి ట్రస్ట్ ద్వారా జిల్లాకు 15 ఆలయాలు మంజూరు కాగా అందులో ఆరు ఆలయాలు ప్రారంభమయ్యాయి. ఇందులో వైఎస్ఆర్ జిల్లా రాజుపాళెం మండలం వెలవలి హరిజనవాడలో, పెండ్లిమర్రి మండలంలోని చీమల పెంట హరిజనవాడలో, సీకే దిన్నె మండలంలోని తూర్పువీధి కాలనీలో, కడపలోని వాటర్ గండి ఎస్టీ కాలనీలో, వేముల మండలం చాగలేరులో, గోపవరం మండలంలోని కొత్త రేకుల కుంట గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఆలయ నిర్మాణాలు పూర్తి కావడంతో కొద్ది రోజుల క్రితం ఆలయాలను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

చురుగ్గా సాగుతున్న ఆలయాల నిర్మాణాలు..

శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత ఫౌండేషన్ సహకారంతో పల్లెలలో నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ముందుగా గుడికి కావాల్సిన స్థల సేకరణ చేపడుతారు. ఆయా వర్గాలకు చెందిన 15 మందితో కమిటీ ఏర్పాటు అయ్యాక ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలను వివిధ దశల వారీగా కమిటీకి చెందిన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. ప్రధానంగా మారు మూల గ్రామాల్లో సీతారామాలయం, వేంకటేశ్వర స్వామి, మారెమ్మ, జంబులా పరమేశ్వరి, చెన్నకేశవ స్వామితో పాటు గ్రామ దేవతల ఆలయాలు నిర్మించనున్నారు.

వైఎస్ఆర్ జిల్లాకు మంజూరైన ఆలయాల వివరాలు	
మండలం	గ్రామం పేరు
రాజుపాళెం	వెలవలి
పెండ్లిమర్రి	చీమలపెంట హరిజనవాడ
చింతకొమ్మదిన్నె	తూర్పువీధి కాలనీ
కడప	వాటర్ గండి ఎస్టీ కాలనీ
వేముల	చాగలేరు
గోపవరం	కొత్తరేకుల కుంట
చక్రాయపేట	గరుగుతాండ
అట్లూరు	అరుంధతీ వాడ
గోపవరం	పీపీ కుంట యానాది కాలనీ
కాశినాయన	రెడ్డి కాలనీ ఎస్టీ కాలనీ
కాశినాయన	ఆకుల నారాయణ పల్లె ఎస్టీ కాలనీ
మైదుకూరు	బస్వాపురం ఎస్టీ కాలనీ
కమలాపురం	జి.అప్పాయపల్లె
వల్లూరు	పెద్ద లేబాకు
రాజుపాళెం	అర్కటవేముల